# గాలివాన




మన వాళ్ళు చెప్పే సామెతలెన్నో నిత్య సత్యాలనిపిస్తూంటాయి. నిజానికి ప్రతినిత్యమూ జీవితాల్లో జరిగే భయంకరమైన సత్యాల్ని ఆకళింపు చేసుకున్న పెద్దల వాక్యాలే ఈ సామెతలుగా రూపొందుతాయంటే అతిశయోక్తి కాదేమో! ఉదాహరణకి "ముల్లువచ్చి అరిటాకు మీద పడ్డా, అరిటాకు వచ్చి ముల్లు మీద పడ్డా, నష్టం అరిటాకు"కేనని. అలాగే మనం చిన్నప్పుడు చదువుకున్న– మహావృక్షమూ, తుంగమొక్కా, గాలివానా– కథ కూడా. చెట్టు ఎంత పెద్దదైనా, తుఫాను వస్తే కూకటివేళ్ళతో పెళ్ళగించబడుతుంది. కాని తుంగ మొక్క మాత్రం అన్నిటికీ తలవొంచి నెగ్గుకొస్తుంది. ఇలాంటి ఎన్నో సామెతలూ, జాతీయాలూ, జీవితాన్ని అరిటిపండొలిచి పెట్టినట్టు వివరించి చూపిస్తాయి. వీటి అవగాహన మనిషికి, తన జీవితాన్ని చక్కని బాటలో తీర్చి దిద్దుకోడానికి దోహదకారి కాగలదు.

కాని, దేశ కాలమాన పరిస్థితులూ, మనిషిలోని ఆకళింపుశక్తీ, అంతర్యాలనీబట్టి వీటి విలువలు మారుతూంటాయి. ఒకనాడు మన దేశంలో అనుశ్రుతిగా వస్తున్న ఆచారాలని దుయ్యబట్టడం పాపం అనే భావన ప్రబలంగా ఉన్న రోజుల్లో అంతా ఆ నిజాల్ని నమ్మేవారు. కాని రానురాను మనిషి స్వతంత్రంగా ఆలోచించడం, పాతని రోసి, వింతగా కనిపించే క్రొత్త పుంతలు తొక్కడం ఆరంభమైనాక వాటికి కొత్త అర్థాలు చెప్పుకుంటున్నాడు. వాటికీ కొత్త విలువల్ని అంటకడుతున్నాడు. నిశితంగా ఆలోచించిచూస్తే, ఈ నాటి అరిటాకులు ఆధునిక శాస్త్ర విజ్ఞానంతో తయారైన ఎరువుల బలంతో పెరిగినవి కాబట్టి ముల్లు విరిగినా విరగవచ్చు!! అలాగే, గాలివాన లెన్నివచ్చినా, తగినంత వేరుదిట్టం, పునాదిబలం ఉన్న చెట్టయితే, ఆ తాకిడికి తట్టుకోగలదు. అంతే కాకుండా, ఆవేశంగా బారలుచాచి, తననీడ క్రింద మరే చెట్టునీ, ఆఖరికి తుంగ మొక్కనీ కూడా పెరక్కుండా ఆపు చేయగలదు. ఇది ఈనాటి సత్యం.

అంత వరకూ దీర్ఘాలోచనలో మునిగి పోయిఉన్న ఆచారిగారు "లోకం ఎంత మారిపోయింది"! అని ఆశ్చర్యపడి ముక్కు మీద వేలేసుకున్నారు వీధి గుమ్మంలో అరుగుమీద కూర్చుని. గునుపూడిలో పూర్వీకులు కట్టి ఇచ్చిన వందేళ్ళ క్రిందటి లోగిలి, ఓ గోడ పడిపోయి, ఓ గది కూలిపోయి, లోపలి పట్టెమంచాలూ, విరుగుడు చేవకుర్చీలూ ఓ నాటి ఔన్నత్యాన్ని చాటుతూంటే, మరో వాస వేసుకోవడానికి ఓపిక లేక అందులోనే కాలక్షేపం చేస్తోంది ఆచారిగారి కటుంబం. అసలే ముక్కు సూటిగా పోయే మనిషి ఆచారిగారు. తన పిల్లలందరికీ కూడా అదే నేర్పాడు. ఆయనొక అయోమయం మనిషని ఊళ్ళో అందరి అభిప్రాయమూనూ. ఉన్న కాసింత పొలంలోనూ, పండిన గింజల్ని నూర్చుకొని, అదే దేముడిచ్చాడని తృప్తిపడి, ఉన్నంతలో, తినీ, తినకా, ఆడపిల్లల పెళ్ళిళ్ళు పూర్తి చేశానని పించాడు. తన పొలం సరిహద్దుల్లో, నాలుగు ప్రక్కలా ఉన్న రైతులు సంవత్సరానికో అడుగు చొప్పున కలిపేసుకుంటూంటే అదేమని అడగలేని ఆచారిగారి పొలం, వారి వయసులాగే హరించుకుపోతోంది. అలా క్షణ క్షణానికీ చితికి పోతున్న ఆయనకున్న ఆశ ఒక్కటే. చదువులో అందరికంటే ముందంజ వేస్తూపోయి, ఇంజనీరింగు పూర్తి చేసిన తన కొడుకు సత్యం. వాడుద్యోగం చేసి, అభివృద్ధిలో కొస్తే' తన కుటుంబభారం కొంత తీరుస్తాడనీ, శేషజీవితం తను రామాకృష్ణా అనుకుంటూ గడపవచ్చనీను. కానీ ఆశ కూడా అడియాసలాగే ఉంది. డిగ్రీ అంటే వచ్చింది కానీ "ఉత్తరాయణం, దక్షిణాయనం" తెలీని సత్తెకాలపు సత్యానికి, "ఉద్యోగ పర్వచర్వణం" మాత్రం అతికఠినంగా ఉంది.

ఆ విషయమే ఆలోచిస్తూ, వీధిలో తమ యింటి కెదురుగా కొత్తగా లేచిన మేడని తదేకంగా చూస్తూ, ఆచారిగారనుకున్న మాటలే "లోకం



# పోలెపు బుచ్చిరాజు

ఎంత మారిపోయింది!'' అని. అది పెరినాయుడు కట్టించిన కొత్త భవనం ఆ మేడనీడ ఆచారి గారింటిని కప్పేస్తోంది పదిహేను లక్షలకు పైగా ఖర్చయిందని జనవాక్యం. పేరంటే పెరినాయుడిది కాని డబ్బంతా కొడుకు వెంకటరమణదేనని చెప్పుకుంటారు.

అదే నిజమయి ఉండొచ్చు. పెరినాయుడ్ని నేనెరగనేంటి!! నాతోటివాడే! "ఏరా నాయుడూ!!" అని పిలిచేవాణ్ని. ఇప్పుడెంత ఎత్తు ఎదిగ పోయాడు? ఆ మాట తల్చుకుంటేనే గుండె జలద రిస్తోంది. వాడదగ్గర పూర్వీకులొదిలిపోయిన అంత డబ్బూ దస్కంలేదు. వెంకటరమణ ఎదిగొచ్చాకే ఈ సంపాదనంతాను. వాడూ సత్యంతోటి వాడే! ఓ నెల ఇటూ అటూగా పుట్టారు. 'ఏడుకొండలవాడి పేరు పెట్టుకో, నీకు జయంగా ఉంటుంది' అని తనే సలహా చెప్పాడు తనకొడుక్కి మో సత్యనారాయణమూర్తి పెట్టుకున్నాడు.

వాళ్ళిద్దరికీ తనే అక్షరాభ్యాసం చేసి చదువు చెప్పాడు. మొదటి రోజు నుంచే చదువులో సత్యానిదే పై చేయి. ఒకటికి పదిసార్లు చెప్తేకాని అర్థమయ్యేది కాదు వెంకటరమణకి కాలేజీ చదువు కొచ్చాక పెరినాయుడు కొడుకు చదువు చాలిం చేశాడు. చదువు రానోణ్ణి పట్నం పంపించడం డబ్బు దండగ పొమ్మన్నాడు నాయుడు "నీ కొడుక్కి చదువొస్తోంది గాబట్టి చదివించుకో. మంచి ఉద్యోగస్థుడవుతాడు. ఈడు గొడ్లని కాసుకుంటూ, మట్టిలు కాల్చుకుంటూ ఈ పూళ్ళోనే వుంటాడు. ఈడేమైనా ఊళ్ళేలాలా'' వాళ్ళే చదువు'' అన్నాడు.

పట్నంలో కాలేజీలో చదువుతూ సెలవులకి ఇంటికొచ్చిన కొడుకు సత్యాన్ని అందరూ తెలివైన వాడని పొగుడుతూంటె తానెంతో పొంగి పోయేవాడు. "నీ కేమయ్యా!! కోటలో పాగా వేసేశావ్ నేడో రేపో కొడుకు చేతికందొస్తాడు. మావాడే ఎందుకూ కొరగాకుండా ఉండిపోయాడు'' అని ఓ నాడు పెరినాయుడు తన దగ్గర వాపోయాడు. అప్పుడు తను ఉచితంగా ఓ సలహా ఇచ్చాడు "అలాగని మనం ఊరుకుంటె ఎలా నాయుడూ! వాడికి నువ్వేదో ఉపాధి చూపించాలి. ఏదైనా బాధ్యత అప్పగిస్తే వాడే నేర్చుకుంటాడు జీవితంలో బతకడం ఎలాగో. నాకైతే ఓ ఊహతోస్తోంది. "గ్రామీణ అభివృద్ధి పథ''కాలంటూ ఈ మధ్య ప్రభుత్వం మన ఊళ్ళో ఎన్నో పనులు చేపట్టు తోంది. ఏ అధికారినో పట్టుకుంటె ఓ కాంట్రాక్టు పారెయ్యకపోడు. ప్రయత్నించి చూడు'' అని. అది బాగా నచ్చింది పెరినాయుడికి.

అదే వెంకటరమణ జీవితాన్ని ఓ పెద్ద మలుపు తిప్పింది కూడా. గునుపూడిలో మంచినీటి సరఫరా పథకం, పాఠశాలల భవనం, ఊరిని పట్నంతో కలుపుతూ రోడ్డూ, గోదావరి నీటిని భీమవరం ప్లాంటుకి మళ్ళించే నీటి కాలువ, అన్ని కాంట్రాక్టులూ వెంకటరమణే చేశాడు. దాంతో ఆ వూళ్ళో ప్రభుత్వం చేపట్టదలచిన అభివృద్ధి అంతా వెంకట రమణలోనే కనిపించసాగింది పెద్ద ఆఫీసు, సిబ్బంది, ట్రక్కులు, పటాటోపం తయారైంది. అలా, చాలా తెలివైనవాడని పేరుపడ్డ సత్యం, రాత్రిం బగళ్ళు కష్టపడి చదివి సంపాదించిన ఓ చిన్న డిగ్రీ ముక్క తెచ్చుకుని ఇంటికొచ్చిన నాడు, గును పూడిలో వెంకటరమణ మకుటంలేని మహారాజులా వెలుగొందుతున్నాడు.

పరిద్దరినీ ఓ త్రాసులో చెరోవైపు వేసి, పెరినాయుడి మేడ పైనుంచి చూస్తే వెంకటరమణ వైపు మొగ్గు చూపేది. అదే ఆచారిగారింట్లోంచి చూస్తే సత్యం వైపు మొగ్గు చూపేది.

"నాయనా సత్యం! నేనిలా అన్నానని కాదు గాని, ప్రస్తుత పరిస్థితుల్లో, కాలానికి తలొంచాలి కాబట్టి చెప్తున్నాను. మన వెంకటరమణ దగ్గరే ఏదైనా ఓ జాబు ఉందేమో చూడరాదా!'' అన్నారు ఆచారిగారు ఒకనాడు కొడుకుతో. సత్యానికి ఒక్కసారిగా ఆవేశం వచ్చింది. శరీరంలోని రక్తం అంతా కళ్ళలో కొచ్చి కళ్ళు ఎరుపెక్కాయి. తనముందు చెల్లని కాసులా తిరిగిన వాడిదగ్గర 'దేహీ' అని ప్రాధేయ పడ్డమా??! అని ఆలోచిం చాడు. కాని వెంటనే చల్లబడిపోయాడు. తండ్రి జీవితాన్ని కాచి వడబోసిన మనిషి. ఎంతో దూరం ఆలోచించి కాని ఈ సలహా ఇచ్చి ఉండడు. కషాయం చేదైనా, జబ్బు తగ్గాలంటే తాగక తప్పదు అందుకే "సరే నాన్నా! ప్రయత్నించి చూస్తాను'' అన్నాడు.

నువ్వు నా దగ్గర చేరతానంటే, అంతకంటే కావాల్సిందేముంది. రేపే జాయినవ్వు. ముందు నెలకు ఆరొందల చొప్పున ఇస్తాను తతిమ్మా

## గాలివాన

విషయాలు తర్వాత మాట్లాడుకోవచ్చు" అన్నాడు వెంకటరమణ. ఆ రోజు నుంచి అతని ఉద్యోగంలో చేరి, కాంట్రాక్టుల్లో లక్షలకు లక్షలు ఎలా మిగుల్చుకోవాలో లెక్కలు వేసి పెడుతున్నాడు వెంకటరమణకి సత్యం.

కొద్ది రోజుల్లోనే, లక్ష్మి కటాక్షం మనిషినెంతగా మార్చేస్తుందో తెలుసుకున్నాడు సత్యం. వెంకటరమణ హుందాతనం, నిర్భీతి, ఏ పనైనా ఏటికలో సాధించగల సాహసం, ఇలాంటి గుణాలన్నిటిని సంతరించుకున్నాడు. మొండి ధైర్యం ఉంటే ధన సంపాదన ఎంత తేలిగ్గా చెయ్యొచ్చో కళ్ళారా చూస్తున్నాడు సత్యం కానీ, ఈ ధైర్యం లక్ష్మీపుత్రులకున్నంతగా సరస్వతీ పుత్రులకుండకపోవడంలోని రహస్యం మాత్రం అతనికర్థం కాలేదు

ఇలా ఉండగా ఓనాడు సత్యం కలలో కూడా ఊహించని ఓ సంఘటన జరిగింది మధ్యాహ్నం టైములో సత్యాన్ని తన ఏ. సి. రూములోకి పిలిపించి కూల్‌డ్రింక్స్ ఇప్పించి వెంకటరమణ చిత్రమైన కోరిక కోరాడు. ఓ ఎర్రని పెద్ద వి. ఐ. పి సూట్‌కేసు చూపించి, "సత్యం, ఇందులో కొన్ని పాత బట్టలున్నాయి. మా ఇంటినిండా సామాను నిండిపోయింది. ఖాళీలేదు. కొద్ది రోజులు మీ యింట్లో పెట్టుకో. నాకవసరం అయినప్పుడు తిరిగి తెచ్చేసుకుంటాను" అని అడిగాడు. ముందు సత్యానికి నమ్మ బుద్ధి కాలేదు. కాని అభ్యంతరం ఎలా చెప్పాలో తెలియక తిక మక పడి, ఆఖరికి సరేనని, ఆ పెట్టె ఇంటికి తీసుకెళ్ళి ఇంట్లో పెట్టుకున్నాడు అలాగే పారిశ్రామిక ఉద్యోగస్తులు కూడా వెంకటరమణ ఇంటికి తరచూ వెళ్ళటం గమనించాడు సత్యం.

మర్నాడు ఉదయం పేపర్లో వేడి వేడి వార్త చదివి, ఆఫీస్లో అందరితో పాటు సత్యమూ ఆశ్చర్య పోయాడు అది, వెంకటరమణ స్థాపించిన కంపెనీ, 'ఏడు కొండల ఎంటర్ ప్రైజెస్'ని ప్రభుత్వాధికార్లు క్రితం రాత్రి రెయిడ్ చేసిన వివరం పది లక్షలకి పైగా నల్లధనాన్ని తో బరుముకున్నారని, ఎగవేసిన టాక్సులు, ఫైనుల క్రింద మరో అయిదు లక్షలు వసూలు చేశారనను

పేపర్లో ఆ వార్త చదివిన సత్యానికి ప్రాణాలు పైనే పోయాయి. ఈ రోజుతో వెంకటరమణ దివాలా అయితే తన బ్రతుకు తెరువుకు కూడా తిలోదకాలే! భయపడుతూనూ, వెంకటరమణని 'ఎలా పలకరించాలా' అని బెదురుపడుతూనూ ఆఫీసుకి చేరుకున్నాడు. కాని అక్కడ ఏమీ జరగనట్టే పనులన్నీ మామూలుగా జరిగిపోతుంటే చూసి నిశ్చేష్టుడయ్యాడు. ఇంత పెద్ద ప్రమాదం జరిగినా నిలదొక్కుకున్న వెంకటరమణ 'గుండె గన్ మెటల్‌తో చేసి ఉండాలి' అనుకున్నాడు.

ఆ సాయంత్రం వెంకటరమణ తన వి. ఐ. పీ వెనక్కి తెప్పించుకున్నాక, సత్యానికి బహుమతిగా అయిదువేల రూపాయలు ఇస్తూ అన్నాడు "నిన్న నీకిచ్చిన ఈ పెట్టె విలువ అయిదు లక్షలు. దీన్ని భద్రంగా కాపాడి నాకు తిరిగి ఇచ్చినందుకు చాలా కృతజ్ఞుణ్ని" అని. ఆ పెట్టెలో అయిదు లక్షల రూపాయలున్నాయనీ, అది నిన్న తన పాడుపడిన ఇంట్లో పాతమంచం క్రింద అరక్షితంగా పడివుందనీ అర్థం చేసుకున్న సత్యం ఆపాదమస్తకమూ కంపించసాగాడు గాలివానలో తుంగ ముక్కలా! ఒళ్ళంతా ఒకసారి చల్లబడిపోయింది. డబ్బు వేయగల చమత్కారాన్ని చూసి, ఆ సరస్వతీ పుత్రుడు చకితుడయ్యాడు గడచిన రాత్రి తనేదో పెద్ద గండం నుంచి బైటపడ్డట్టు ఫీలయ్యాడు. ఈ రోజు రాత్రంతా అదే విషయం ఆలోచిస్తూ సత్యం అసలు నిద్రపోలేదు.

ఈ రోజు రాత్రి వెంకటరమణ కూడా నిద్రపోలేదు. ప్రభుత్వాధికార్లతోనూ, తన కంపెనీకి పబ్లిసిటీ ఇచ్చిన వారితోనూ, మందు పార్టీలో లీనమై తెల్లవార్లూ గడిపేసాడు ముందుగానే టిప్ ఆఫ్ చేసినందుకు కొందర్ని, వలనుంచి తప్పించుకునే ఉపాయాలు చెప్పినందుకు మరి కొందర్ని, తప్పుడు లెక్కలు రాసి ఫైను తగ్గించినందుకు ఇంకా కొందర్ని తెల్లవార్లూ. వాళ్ళకి కావలసినవి ఇప్పించి, తృప్తి పరిచాడు. కానీ, వెంకటరమణ ఈ విషయం మాత్రం ఎవ్వరికీ తెలియనివ్వలేదు.

ఎందుకంటే, అతనికి తెలుసు సత్యంలాంటి వాళ్ల గుండెలు చాలా నీరసంగా ఉంటాయనీ, అవి, ఇలాంటి షాక్‌ని తట్టుకోలేవనీ- □

